







జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

గడపగడపలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 18వ వార్డు బలిఘట్టంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ కుళాయిల నుంచి 20 రోజులుగా బురదనీరు వస్తుందని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఏఈ రవికి చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నామని వార్డు ప్రజలు విన్నవించారు. వీటి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సంక్షేమ పథకాలను అర్హత కలిగిన వారికి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. పేదరికాన్ని రూపు మాపేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ, వార్డు సీనియర్ నాయకులు శెట్టి మోహన్, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు బయపురెడ్డి చినబాబు, కర్రి చైతన్య, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఎండీ.బాషా, టౌన్ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, సుర్ల నాయుడు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం వద్దు


నగరంలో ఏర్పాటు చేసిన ప్రకృతి ఎరువుల దుకాణం

మాకవరపాలెం: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సేద్య పద్ధతుల్లో తయారు చేసిన ఎరువులపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదర్శన్, వరలక్ష్మి కోరారు. ఆదివారం మల్లవరం శివారు ఎం.నగరంలో ప్రకృతి సేద్య పద్ధతుల్లో తయారు చేసిన ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ దుకాణంలో బీజామృతం, ఘన, ద్రవ, జీవామృతాలతోపాటు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నస్త్రం వంటి కషాయాలు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. రైతులు వీటిని కొనుగోలు చేసుకుని ఆరోగ్యవంతమైన పంటను పొందాలని సూచించారు.

ఓటుహక్కు కల్పించేందుకు కృషి

గునిపూడిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గణేష్

నాతవరం: 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించేలా పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం గునిపూడిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఓటరు సర్వే చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఓటు హక్కు కల్పించేందుకు 18 ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుందన్నారు. గ్రామంలో అటువంటి వారిని గుర్తించి వారికి ఓటుహక్కు కల్పించడానికి పార్టీ నాయకులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయశాఖ సలహా కమిటీ చైర్మన్ శెట్టి నూకరాజు, వైస్ ఎంపీపీ పైల సునీల్, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల పోతురాజు, పి.కె.గూడెం, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు ఎ.వరహాలబాబు, గొర్లె వరహాలబాబు, సర్పంచ్‌లు వి.సూర్యనారాయణ, వెంకటరమణ, ఉలబాల శ్రీనివాస్, సోమన్నదొర, కాళ్ల సత్యనారాయణ, అడిగర్ల నాయుడు, లాలం లోవ, సబ్బవరపు వెంకునాయుడు, అచ్చింనాయుడు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక నేడు

దేవరాపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజా వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో చంద్రకళ తెలిపారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు 27 పంచాయతీల్లో చేపట్టిన అన్ని పనులపై సోషల్ ఆడిట్ బృందాలు ఈ నెల 7 నుంచి 30వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించారన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో గుర్తించిన పలు అంశాలను చర్చించేందుకు గాను మండల ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు


మోదమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులతోపాటు దూర ప్రాంతాల వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

నూకాంబిక ఆలయంలో...

కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అదే రోజు రాత్రి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







మీనామృతం తయారీపై అవగాహన

రావికమతం: పంట ఎదుగుదలకు, దిగుబడికి చేప బెల్ల ద్రావణం(మీనామృతం) ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం రిసోర్స్ పర్సన్లు గుణావతి, స్వాతి తెలిపారు. ఆదివారం కొత్తకోటలో రైతులకు స్వాతి ఇతర సభ్యులు, దొండపూడి గ్రామ రైతులకు గుణావతి ఇతర సభ్యులు మీనామృతం తయారీపై అవగాహన కల్పించారు. కేజీ నల్లబెల్లం , కేజీ చేపలపొట్టును లీటరు నీటిలో కలిపి 25 రోజుల పాటు నిల్వ చేయాలన్నారు. రోజూ కర్రతో కలియతిప్పుతూ ఉంటే మీనామృతం తయారవుతుందన్నారు. పంటకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో మూడు లీటర్లు కలిపి పంటకు పిచికారీ చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ ద్రావణాన్ని ఆర్నెల్ల వరకూ నిల్వ చేసుకోవచ్చని రైతులు ప్రతి ఒక్కరూ తయారు చేసుకోవాలని సూచించారు.


రైతులకు మీనామృతంపై అవగాహన కల్పిస్తున్న గుణావతి

సత్యసాయి ప్రేమ రథానికి విశేష పూజలు

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి బాబా ప్రేమ రథం వద్ద మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాబాకు హారతి సమర్పించి భక్తి శ్రద్ధలతో విశేష పూజలు చేసి సత్య సాయి ప్రేమ రథాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం బాబా వారి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. దేవరాపల్లితో పాటు రైవాడ గ్రామాల్లో ఊరేగిన బాబా రథం వద్ద పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామీణ ప్రజలందరికీ బాబా దర్శన భాగ్యం కల్పించి ఆశీస్సులు అందించాలనే సంకల్పంతో సత్యసాయి ప్రేమ రథం గ్రామాల్లో తిరుగుతోంది. సత్య సాయి సేవా సమితి కన్వీనర్ శంకర్‌రావు, సభ్యులు సూర్యం, రవి శంకర్, రమణమూర్తి, నౌడు అప్పారావు, జగన్నాథం, కన్నబాబు, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.


సత్యసాయి ప్రేమ రథం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ భాస్కరరావు

నూకాంబికా.. నమోస్తుతే

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో, ఈ రోజు పూజిస్తే కోరిన వరాలిస్తుందన్న నమ్మకంతో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి, అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలిచ్చేందుకు అనువుగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రక్తదానంతో ప్రాణదానం

అనకాపల్లిటౌన్: ఆరోగ్యవంతుడైన వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణదానం చేసినట్టేనని మిత్రా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ప్రతినిధి గుండా రమేష్‌గుప్తా అన్నారు. స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రతీ ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుని, రక్తదానంతో పాటు వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. విశాఖ ఏఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 60 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు.

సోనూసూద్ జన్మదినాన గొడుగుల పంపిణీ


సోనూసూద్ జన్మదినం పురస్కరించుకుని నిరుపేదలకు గొడుగుల పంపిణీ

అనకాపల్లిటౌన్: ప్రఖ్యాత నటుడు, కోవిడ్ విపత్తులో ప్రజలను ఆదుకోవడంలో ముందున్న సోనూసూద్ జన్మదిన వేడుకలు స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోనూసూద్ అనకాపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి కొడుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, గొడుగులు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనూసూద్ కరోన సమయంలో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా చేసిన సేవలను వివరించారు. అనంతరం 300 మందికి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాండ్రేగుల నాయుడు, రేబాక మధు, కాండ్రేగుల రమణ, మద్దాల శ్రీను, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, తాడి శాంతి, గుండా సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహ మాసోత్సవాలు


పిండి వంటలను పరిశీలిస్తున్న అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు

అనకాపల్లిటౌన్: అంతర్జాతీయ స్నేహ మాసోత్సవ వేడుకలు ఆగస్టు 6 వరకూ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పిండి వంటల పోటీలు, ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ఏటా క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆగస్టు 6న అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త


మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

కశింకోట: అపరిచిత వ్యక్తుల పట్ల మహిళలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కశింకోట అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని తేగాడ గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం సీడ్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్ల ద్వారా ఉద్యోగాలు, ఉపాధి, ప్రేమ పేరిట వచ్చే ఫోన్లను విశ్వసించరాదన్నారు. పూర్తిగా నమ్మకం ఉంటే తప్ప ఎవరితోనూ ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వాహనాలపై వెళ్లరాదని హెచ్చరించారు. మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, వాటిని అవసరమైనప్పుడు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు.

ముమ్మరంగా దమ్ములు

గొలుగొండ: మండలంలో రైతులు ముమ్మరంగా దమ్ములు పడుతున్నారు. దారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రిగెడ్డ, విప్పలపాలెం రిజర్వాయర్ దిగువన నాలుగు వేల ఎకరాల్లో నాట్లు వేయడం కోసం పనులు చేస్తున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు అధికంగా కురవడంతో చెరువుల్లో కాలువల్లో సాగు నీరు పుష్కలంగా ఉంది.

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలకు ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరినారు సిద్ధంగా ఉండటంతో రైతులు దమ్ములు చేస్తున్నారు. మరో వైపు వరినాట్లు వేస్తుండటంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. పాలగెడ్డ, తారకరామ, కోనాం జలాశయం ఆయకట్టులో వరినాట్లు వేస్తున్నారు.


కొత్తపాలెంలో దమ్ములు పడుతున్న దృశ్యం

శాకంబరి అలంకరణలో దుర్గమ్మ

మాకవరపాలెం: దుర్గామల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.
కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మల్లిఖార్జునశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





















ప్రారంభానికి సిద్ధమైన తహసీల్దార్ కార్యాలయం

రూ.90 లక్షలతో కొత్త భవన నిర్మాణం


శిథిలమైన తహసీల్దార్ కార్యాలయం


నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం

బుచ్చెయ్యపేట: నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. 30 ఏళ్ల క్రితం బుచ్చెయ్యపేటలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమైంది. వర్షం కురిస్తే నీరు లీకై కారడంతో రికార్డులన్నీ తడిచిపోతున్నాయి. అధికారులు, ప్రజలు పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి తడిచి కంప్యూటర్లు పనిచేయడం లేదు. శ్లాబు పెచ్చులాడి మీద పడటంతో ఉద్యోగులు, కార్యాలయానికి వస్తున్న ప్రజలు ఎప్పుడే ప్రమాదం సంభవిస్తోందని భయాందోళన వ్యక్తం చేసేవారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, కొత్త భవన నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేయించారు. పాత తహసీల్దార్ కార్యాలయానికి తాత్కాలికంగా కొద్దిపాటి మరమ్మతులు చేపట్టారు. దీని పక్కనే కొత్త తహసీల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు చేపట్టారు. తహసీల్దార్‌కు, ఆర్ఐలు, డిప్యూటీ తహసీల్దార్‌కు, మీటింగ్ హాలు, రికార్డులు భద్రపరిచే గదులు విశ్రాంతిగా ఉండేలా భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి కావడంతో కార్యాలయానికి రంగులు వేశారు. వారం రోజుల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి ప్రారంభించేందుకు నాయకులు, అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి


కె.సంతపాలెంలో సాగులో కాలీఫ్లవర్

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కాలీఫ్లవర్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆర్లి, కె.సంతపాలెం, గవరపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, గొల్లలపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో 50 ఎకరాల్లో సాగవుతోంది. ఈ సాగు ప్రారంభించి 15 రోజులు కావస్తుందని, అరవై రోజులకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరా పొలంలో సాగుకు దుక్కులు, గొప్పులు, సస్యరక్షణ చర్యలు, కూలీలకు పెట్టుబడిగా రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రస్తుతం కూరగాయలకు మంచి డిమాండ్ ఉండటంతో కోత సమయంలో కాలీఫ్లవర్‌కు మంచి మద్దతు ధర లభించనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తుది దశకు ప్రభుత్వ భవన నిర్మాణాలు

మామిడిపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా సచివాలయ భవన సముదాయాలు



మామిడిపల్లిలో ఆఖరి దశకు చేరుకున్న సచివాలయ భవన నిర్మాణం


మామిడిపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా ఆర్బీకే


విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి పెయింటింగ్ వేస్తున్న దృశ్యం

దేవరాపల్లి: మామిడిపల్లిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు పర్యవేక్షణలో ఈ పనులు చేస్తున్నారు. త్వరలోనే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో ప్రస్తుతం పెయింటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు భవన నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.



మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నర్సీపట్నం: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో ఆదివారం మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులనుద్దేశించి జడ్జి మాట్లాడుతూ పిల్లలను ట్రాఫికింగ్ పాల్పడటం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల తీవ్ర పేదరికం, అప్పులు తీర్చడం కోసం పిల్లలను అక్రమ రవాణదారులకు అమ్మే అవకాశాలు లేకపోలేదన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఎ.గోవిందరావు, ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వనరుల శిక్షణ కేంద్రం ప్రారంభం


రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ దేవి

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ శాఖ సౌజన్యంతో ఆదివారం జానకీరాంపురంలో వనరుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ఆదపురెడ్డి ముసలినాయుడు ప్రారంభించారు. దీనిలో భాగంగా మాస్టర్ ట్రైనీ దేవి ముందుగా వనరులను ప్రదర్శించారు. వీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మేలు గురించి, కషాయాలు వినియోగం, భూముల సారవంతం, పంటల ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో మోదినాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







మోదకొండమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర వాసుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఇక్కడ తెల్లవారు నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదంతోపాటు తాగునీరు ఉచితంగా అందజేశారు. గ్రామానికి చెందిన వంద మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రెయిన్ వ్యవస్థ మెరుగుకు చర్యలు


పైపులు ఏర్పాటు చేస్తున్న గ్రామీణ అభివృద్ధి సంఘ సభ్యులు

రోలుగుంట: బుచ్చింపేటలో గ్రామీణ అభివృద్ధి సంఘం సభ్యులు డ్రెయిన్ వ్యవస్థ మెరుగుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా వీధిలో తీవ్ర సమస్య ఉన్న ప్రాంతంలో దాతల సహకారంతో రూ. 50 వేలతో సమకూర్చిన పైపులైను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో బాధిత వీధివాసులు గ్రామీణాభివృద్ధి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే


సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: ఎం.బి.పట్నంకు చెందిన మాజీ సర్పంచ్ వర్రి సత్యనారాయణను ఆదివారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ మూడు నెలలుగా విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆయన్ను కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నర్సీపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ టి.నాయుడు, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు ఉన్నారు.

బాలికల అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ


రావికమతంలో మానవహారం దృశ్యం

రావికమతం: బాలికల అక్రమ రవాణా నేరమని, అటువంటి వారికి కఠిన శిక్షలు పడుతుండటమే కాక బాలికల రక్షణకు ఎన్నో ప్రత్యేక చట్టాలను ప్రభుత్వ ప్రవేశ పెట్టినట్టు ఏఎస్ఐ ప్రసాదరావు, సీడ్ సంస్థ కోఆర్డినేటర్ బెన్నారావు తెలిపారు. ప్రపంచ బాలికల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీడ్ సంస్థ ఆధ్వర్యంలో రావికమతంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను, బాలికల రక్షణకు ఉన్న చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ సభ్యులు పలువురు పాల్గొన్నారు.







'50 శాతం రాయితీపై రుణాలివ్వాలి'

అనకాపల్లి రూరల్: గొర్రెలు, మేకల పెంపకందార్లకు 50 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల మేర రుణాలివ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గొర్రెల సహకార సంఘాలకు రూ.88 కోట్లు ఎన్‌సీడీసీ నిధులు విడుదల చేయాలని, 50 ఏళ్లు దాటిన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మేకలకు, గొర్రెలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద త్వరలో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శరవేగంగా కింతలి రోడ్డు పనులు


రోడ్డు పనుల్లో భాగంగా చదును చేస్తున్న పొక్లెయిన్లు

మాడుగుల: మండలంలో 40 గ్రామాలకు ఆధారమైన కింతలి ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏళ్లుగా ఈ రోడ్డు గోతులమయంగా మారడంతో గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లడానికి నానా అవస్థలు పడేవారు. దీంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్పందించి నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి.







మన్‌కీ బాత్ ప్రదర్శన


మోదీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నేతలు

కోటవురట్ల: తాళ్లపాలెంతో పాటు పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ 103వ ఎపిసోడ్ ప్రసారాన్ని టీవీల ద్వారా ప్రదర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, పార్టీ స్థానిక నాయకులు పలు చోట్ల ఈ కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి తిలకించారు.

